కథ :-

# ★ తొలగిన మబ్బులు ★

రాధ ఇంగ్లీషు కాంపోజిషన్ దిద్దటంలో మునిగిపోయింది. వ్రిక్కకిటికీలో నుంచి వేయెండ కిరణాలు తాకుటచే ఆమె చెక్కిళ్ళు వింత సోయగంతో మెరుస్తున్నాయ్. తెల్లగా, పొడవుగా ఉన్న ఆమె వేళ్ళు పుస్తకాలపై నాట్యమాడుతున్నాయి. విశాలమయిన వీనులపై వెడల్పాటి చెవురెప్పలు బరువుగావ్రాలి కదుల్తూ కొంగ్రొత్త అందాన్ని కలిగించుతున్నాయి. కనులకు తీర్చిన కాటుక రేఖలు. అర్చిలా ఉన్న కనుబొమలపై తళుక్కున మెరిసే నల్లని కుంకుమ. ఫాలముపై అక్కడక్కడా స్వేద బిందువులు ఆమె అందానికి వన్నె తెస్తున్నాయి. మధ్య మధ్య నుదిటిపై నాట్యమాడే ముంగురులను ఎడమ చేత్తో తోసుకుంటూ, చిన్ని పెట్టని పెదాలను పునిపంటితో నొక్కుతూ, ఎడమ చేతిని చెక్కిలికాన్చి, సన్నగా ఏదో పాట పాడుకుంటూ తనపనిలో లీనమైపోయింది రాధ. ఇంతలో నీల విసురుగా లోపలికివచ్చి పుస్తకాలు షెల్ఫులోకి గిరాటుకొట్టి హు ! అంటూ కుర్చీలో కూలబడింది. రాధ నవ్వుతూ తలెత్తి చూచి "ఏమిటే పాపాయ్! అలా హుంకరిస్తున్నావ్ !" అంది. నీల మరీ కోపంగా "ఇదిగో చెప్తున్నా అల్లాయ్ నన్ను పాపాయ్, పీపాయ్, అంటే ఊరుకోను. నిక్షేపంలా నీలా అని పిలు, లేదా రాణీ అని అను, అదీ కాదా నీలా రాణీ అంటే సంతోషిస్తా" "మీ నాన్న, అమ్మ అలాగే పిలిస్తే నేను అలాగే పిలుస్తాను ఏం నీలా?" "నీవు ఎలా పిలిచినా సరేగాని, మా ఫ్రెండ్సు ఉన్నప్పుడు మాత్రం పాపాయ్ అనకు, వాణిని వాళ్ళింట్లో అంతా "చిన్నీ" అంటారట. నిన్న మా బాయ్ స్టూడెంట్సు చిన్నీ, పిన్నీ, గిన్నీ అంటూ ఒకటే గోల మా వెనక."

"అయితే నిన్ను కూడా ఎవరన్నా అన్నారా, ఇవాళ అలా ఉన్నావు" అంటూ సమాధానానికైనా ఎదురు చూడకుండా తన పనిలో మునిగిపోయింది రాధ.

"ఇలాంటి వాళ్ళకి బుద్ధిలేని వాళ్ళిస్తారు ఉద్యోగం" అంది నీల. "ఎవరికి?" అంటూ దిద్దటంలో ఏమన్నా లోపం వచ్చిందేమో అని ఒక సారిగా ఆ పేజీపై దృష్టిసారించింది రాధ.

"ఊ, ఎవరికి ! బుద్ధిలేని మా లెక్చరర్ లాంటి వాళ్ళకి"

"తప్పు తప్పు గురువుని తిట్టొచ్చా"

"ఆ, గురువు కాని వీళ్ళు చేసే పనులు..."

"అసలు విషయమేమిటే ?"

"ఏముందీ నేను కాలేజీలో జాయినయిన దగ్గర్నుంచీ చూస్తున్నాను. ఆయన కళ్ళెప్పుడూ నా మీదే ఉంటాయ్."

'అయితే సౌందర్యారాధకుడన్నమాట' అంది చిలిపిగా రాధ.

"ఆ బావుంది తెలివి; ఆయిన్ని పిలిచి నీ యెదురుగా కూర్చోబెడతాను, నా బదులు నిన్ను ఆరాధిస్తాడు. ఇద్దరం ఒకే పోలికలో ఉంటాము గదా"

"అది కాదు నీలా. నీవు అతన్ని చూడకపోతే నిన్ను చూచినట్లు ఎలా తెలిసిందీ అని."

"అందుకే నిన్ను తెలివితక్కువ దానివంటారంతా, ఏ మనిషి గుడ్డని లేసి చూచేది, మామూలుగా చూచేది ఆ మాత్రం కనిపెట్టగలనులే, నీవన్నట్లే, చూస్తే చూచాడని ఊరుకున్నాను. కాని వ్యవహారం ముదిరింది." అంటూ నీల ముఖం చిటపటలాడించింది.

రచన

శ్రీ. పి. కళ

"అతనిక్కడ లేడులే ఉగ్రరూపం చాల్చకి అసలు విషయం చెప్ప" అంది రాధ నవ్వు నాపుకుంటూ.

"చూస్తున్నవాడు చూస్తున్నట్లూరుకోక బాడీ గారులా సన్నింటి దగ్గర వదిలేసి మరీ వెడుతున్నాడు."

"అంతేనా, ఫరవాలేదులే"

"ఆహా, నీ కలాగే అంటావ్. వెంట వస్తూ ప్రశ్నలువేసి వేపుకు తింటాడా !"

"అయితే ఘోరమే, ఏమన్నాడేమిటి?"

"నీ పేరు నీలారాణీ కదూ !" అన్నాడు.

'ఊ' అన్నాను.

"అక్కయ్య లున్నారా ?" అన్నాడు.

"అన్నయ్యలున్నారా అని అడిగినా మర్యాదగా ఉంటుంది. అక్కయ్యలున్నారా అని అడగటం బావుందా అంట"

"ఆ, తరువాత" అంది రాధ.

"లేరు అందరికీ నేనే అక్కయ్యని అని అన్నా

"మీ నాన్న పేరు" అన్నాడు.

నాకు వళ్ళుమండి "మా నాన్న పేరా ! మరచిపోయానండి. రేపు చెబుతాలెండి" అంటూ త్వరత్వరగా నడచి వచ్చేశాను. అసలే మా స్టూడెంట్సు మంచివాళ్ళు కారు. ఇలా కబుర్లు చెప్పుకుంటూ వీధిన నడుస్తుంటే ఇంకేమయినా ఉందా" అంటూ తన పెద్ద కళ్ళని మరీ పెద్దవి చేసింది.

"ఊ" అంటూ తలవంచుకొని తన పనేమిటో చూచుకోవటం మొదలు పెట్టింది రాధ. "అబ్బ ! ఆ పనేదో ఆపేసి ముందు వాడికి బుద్దెలా చెప్పాలో ఆలోచించిచెప్పు" రాధ ముందు పుస్తకాలు లాగేసింది నీల.

'ఇంతకీ ఆ లెక్చరర్ పేరేమిటన్నావ్'

"ఆయన పేరా దేవానంద్."

"ఆ! దేవానందా."

ఏమో పేరెవడికి తెలుసు. అంతా దేవానంద్ అంటారు, కాలేజీలో జాయినయి నెలరోజులు కాలేదు, అప్పుడే వాళ్ళ అసలు పేర్లెలా తెలుస్తాయేమిటి." అంది విసుగ్గా.

అయితే బావుంటాడన్నమాట."

"ఆ, ఉంటాడులే "అంది నీల" ఎన్నేళ్ళుంటాయ్?" అందిరాధ.

'ఇరవై ఐదు. ఇరవై ఆరు ఉండొచ్చు. ఏమిటీ క్రాస్ఎగ్జామినేషన్?" అంది విసురుగా.

"పాపం! నిన్ను ప్రేమించాడేమో?"

"ఆ, ఏడ్చాడు." అంటూ కోపంగా లేచి నిలబడింది నీల

తప్పేముంది? అందంగా ఉంటాడు, చదువుకున్నాడు, ప్రేమించాడు గనుక మీనాన్నతో చెప్పి పెండ్లిచేసుకో, నన్నడిగితే మీనాన్నకు చెప్పేందుకు కావలసిన సహాయం చేస్తాలే.

"చాల్లేఇహ ఆపుఅత్తా నీ మాటలు. పెళ్ళట పెళ్ళి. పెండ్లి చేసుకొని నీవేమాత్రం సుఖపడుతున్నావ్! నేను అనుభవించటం ఒక్కటే తరువాయి." అంటూ విసురుగా లోపలికెళ్ళి పోయింది నీల. సూర్యుడు పశ్చిమాద్రికి చేరుకున్నాడు. గదంతా చీకటి తెరలు అలముకున్నాయి. రాధ ఆలోచనలు గతం జరిగిన విషయలాలోకి పొచ్చుకొని పోయాయి నీల అన్నట్లు తనేమి సుఖమనుభవించింది? ఇంటర్ ఫస్టుక్లాసులో పాసయింది, పదహారు వసంతాలు నిండాయి. తనకింకా చదవాలనేఉంది కాని తండ్రి రిటైర్డు టీచరు, అన్న బి. యిడి టీచరు. ఏదో కొద్ది పొలం ఉన్నా పిల్లలూ, సంసారం చక్కదిద్దుకొనే సరికే తలప్రాణం తోకకొస్తుంది. అలాటప్పుడు తను బి. ఏ. కి ఏవిధంగా చదువగలదు? తండ్రికి తన పెళ్ళిని గురించి ఆరాటం ఎక్కువైనది. తనను చూచుకొనేందుకు ఎవరో వస్తారని నాన్న హడావిడిగా తిరుగుతున్నాడు. వదిన రకరకాల పిండివంటలు శ్రమ అనుకోకుండా చిరునవ్వుతో చేసేస్తుంది.

తను అప్పుడు అచ్చు నీలలా ఉండేది. లేత నీలం సిల్కుచీరపై, బిస్కెట్ కలర్ బ్లౌజు, పొడవాటి రెండు జడలలో రెండు గులాబీలు, మెడలో సన్నని ముత్యాలదండ వదిన తనను చూచి నుదిటిపై చిన్నగా ముద్దుపెట్టుకొని "రాధా!" అబ్బాయి ముగ్ధుడైపోవాలి సుమా..."అంటూ ఆప్యాయత నిండిన కళ్లతో చిరునవ్వు లొలికించింది. తను వెళ్ళి చాపపై కూర్చుంది. అన్నయ్య అతనితో "పిల్లను జాగ్రత్తగా చూడు నాయనా, ఏమన్నా ప్రశ్నలడుగుతావేమో అడుగు" అన్నాడు. అతను నవ్వుతూ "అన్నీ తెలిసినవే గదండీ. పేరు రాధారాణి, ఇంటర్ ఫస్టుక్లాసు. వంట వచ్చా అని అడగటం నాకు ఇష్టంలేదు అన్నట్లు రాధా! మీకేమైనా పాటలు వస్తే...." అంటూ అర్థోక్తిగా ఆపేశాడు.

"పాడమ్మా రాధా!" అంటూవదిన మునివేళ్ళతో చుబుకము పట్టుకొని పైకెత్తింది. తనురెప్పలు వాల్చేస్తూ తనకిష్టమైన పాట "సావిరహేతవ దీనా రాధా" అంటూ మొదలు పెట్టింది, తను పాటెప్పుడు ఆపిందో తనకే తెలియదు. 'ఏమీ అనుకోకుంటే మరో పాట' అన్నాడతను. అప్రయత్నంగా "రావోయి రావోయి ఓ మాధవా" పాడుతూ మాధవుణ్ణి మదిలో నిలిపి పాటకు శృతి కలిపింది. కంఠం వేయి కిన్నెరలు మీటినట్లుందని రిమార్కు చేశాడు కాబోయే మామగారు, వాళ్లకు అన్నివిధాలా నచ్చింది కాని కట్నమే తెచ్చింది పేచీ. అతన్ని చూచినప్పట్నుంచి అలాటి అల్లుడే కావాలనే తండ్రి కోరిక ప్రబలమైనది. ఆస్థి, అందం, చదువు, సంస్కారం మూర్తీభవించిన అతన్ని చూచాక, అతని తల్లి గయ్యాళితనం, ధనకాంక్ష లెక్కచేయక, కట్నానికి వెనుకంజవేయక పెండ్లి కాయపరచాడు తండ్రి. ఎన్ని విధాల కష్టపడి డబ్బు కూడబెట్టినా రెండు వేలు తక్కువయాయి. మంగళ సూత్రధారణ ఒకవైపు జరుగుతుంటే, అత్తగారు ఒకవైపున నోట్లు లెక్కబెడుతుంది. తండ్రి, అన్న చేతులు కట్టుకొని మిగిలిన రెండువేలూ తరువాత ఇస్తామని ప్రాధేయపడుతున్నారు, కాని ఆవిడ "కృష్ణా! పీటలమీదనుంచి లే" అంటూ ఉరుములా గర్జించింది. "ఇదిగో వస్తున్నానమ్మా" అంటూ తన గళములో మంగళసూత్రం కట్టి తల్లి దగ్గరకెళాడు,

'మంగళసూత్రం ఎందుకు కట్టావురా?' అని గట్టిగా గద్దించింది. "అమ్మా! ఆ రెండువేలూ తరువాత ఇస్తామన్నారుగా ఎందుకీ రగడ" అన్నాడు. "అసలు ముందిక్కడ్నుంచి పద" అంటూ అతన్ని లాక్కెళ్లింది. వదిన మెడలో నగలుపోయి నూలుతాడు వచ్చినా, ఉన్న కాస్తభూమీ అమ్ముడుపోయినా, అప్పులు నిండాపున్నా అభాసుపాలు కాక తప్పలేదు. వదినా, తనూ ఒకర్ని చూచి మరొకరు కుమిలిపోయారు. అన్నయ్య కండువాతో చాటుగా కన్నీళ్ళు వత్తుకోవడం, నాన్న ఆడదానిలా గావురుమని ఏడవటం చూస్తే తన గుండె పగిలిపోలేదేమా అనుకుంది.

రోజులూ, నెలలూ దొర్లిపోతున్నాయి. తను బి. ఏ. లో జాయినయింది. అన్నయ్య తన కోటకు మరో నాలుగు ప్రయివేట్లు చెప్పేందుకొప్పుకున్నాడు. వదిన రాట్నం మీద తీరిక చిక్కినప్పుడంతా నూలుతీస్తుంది. తను కూడా కాలేజీ నుంచి వచ్చి వదినకు సహాయపడేది. అసలే గుండె జబ్బుతో బాధపడే నాన్న ఒకరోజు అందర్నీ వదిలేసి పుట్టెడు దుఃఖముతో ఈ లోకాన్ని వదిలేశాడు, అంతలో అన్నయ్యకు ఆ వూరి నుండి ట్రాన్స్ఫర్ అవడం అన్నీ ఒక్కమారే జరిగాయి. బి. ఏ అయ్యాక కొన్నాళ్ళు ఖాళీగానే ఉంది. రెండు సంవత్సరాలనుండే క్లర్కుగా చేస్తోంది. జీవితం యాంత్రికంగా గడిచిపోయింది అత్తగారిల్లు ఎలా ఉంటుందో ఎరగదు. ఆయన మళ్ళీ పెళ్ళి చేసుకుంటారని ఎవరినోటో విన్నది. ఆయనిప్పుడెలా ఉంటారో? ఎంత గుర్తు తెచ్చుకోవాలన్నా ఆయన మూర్తి మెదడులోకి ప్రవేశించటంలేదు. ఎప్పుడో ఏడు సంవత్సరాలనాడు పెళ్ళిలో చూచీచూడని చూపులు ఇన్నేళ్ల తర్వాత ఎలా గుర్తిస్తాడు. అప్పుడంతా ఈడూ జోడూ బావుందమ్మా అన్నారు. కాని డబ్బుముందు ఏవీ పనికిరాలేదు.

తనఈడు వాళ్ళంతా పిల్లా, పాప, సంసారాలతో ఎంత ఆనందంగా గడుపుతున్నారు. పెళ్ళయి ఆరునెలలు కాలేదు సీత కప్పుడే నాలుగోనెల గర్భిణీ. మొన్న

వాళ్ళింటి కెళ్ళేసరికి వీధి తలుపేసుంది. అనుకోకుండానే కిటికీలో నుంచి లోపలికి చూచింది. సీత భర్తవడిలో ఇమిడి పోయున్నది. అతని పెదవు లామె మోముపై చిలిపిగా చిందులేస్తున్నాయి. అమె బాహువు లతని బాహువుల్లో పెనవేసుకు పోయినాయి. తనిక చూడలేక వెనక్కి తిరిగి వచ్చేసింది. నిన్న తను ఆఫీసు రూంలో కెడుతుంది. తనకో క్లార్కు మూర్తి 'ఒరేసత్యం మన రాధాదేవిని భర్తఎందుకు వదిలేశాడంటావ్' అన్నాడు, ''ఈ రా ధా దే వి ఏకృష్ణుడితో రాసక్రీడలు సలుపుతుంటే చూ చా డో, తప్పులు బయట పడకుండా వుండాలనే అంత గంభీరంగా ఉంటుంది.'' అంటూ సత్యం హేళనగా నవ్వుతుంటే మూర్తీ నవ్వబోయి తనను చూచి పక్కకు తప్పకున్నాడు. తన జీవితం ఎంత వేదనా భరితమైపోయింది ? తనను చూచి నీల "నాకు ఈజన్మలో పెళ్లొద్దు బాబూ''అంటూ గోల పెడ్తుంది. నీల జీవితం నా వలె కాకుండా సుఖమయం చేయి భగవాన్ అంటూ చెక్కిళ్ళపై కన్నీళ్లు తుడుచుకుంది రాధ.

''చీకట్లో ఏం జేస్తున్నావ్ రాధీ !'' అంటూ లైటు వేశాడు. అన్నయ్య.

నీవు దిద్దిపెట్టమన్న బుక్స్ 'ఇంకా నాలుగున్నాయ్,' అంటూ పుస్తకాలందించింది.

ఆ రోజు ఆదివారం. నీల ఉదయమే వాణీ వాళ్ళింటికెళ్ళింది. అన్నయ్య బజారెళ్లాడు. వదిన లోపల వంటలో వుంది. 'అబ్బ ! పొద్దున్ననగా పోయి ఇంకా రాలేదే నీల' అని అనుకుంటూ రాధ వీధి గదిలోకొచ్చింది. టేబుల్‌పై శరత్ నవలలున్నాయ్, వాలు కుర్చీలో మేను వాల్చి పుస్తకం తెఱచింది. పొడవైన ఆమె జడ నేలపై జీరాడుతోంది.

"రావుగారున్నారా" అంటూ ఓ యువకుడు గదిలోకొచ్చాడు.

"అన్నయ్య లేడండి, బజారెళ్ళాడు అంటూ లేచి నిలబడింది"

''ఇప్పుడొస్తారా'' అంటూ కుర్చీలో కూర్చున్నాడు,

"ఆ వచ్చేవేళయింది'' అంటూ అక్కడి నుంచి వెళ్ళే ప్రయత్నంలో ఉంది రాధ.

'మీరు చదివే పుస్తక మేమిటి ?'

'నా పుస్తకమా, చరిత్రహీనులు' అంటూ పుస్తకం చూస్తూ తడబడుతూ జవాబిచ్చింది.

'వెళ్లిపోతారేం కూర్చోండి మీరుకూడా' అన్నాడతను.

తప్పదురా దేవుడా అనుకుంటూ కుర్చీలో కూలబడింది.

'నీల మీకే మవుతుంది ?'

"మా అన్నయ్య కూతురు. అది మీ ఫ్రెండా ?"

'అచ్చు మీ పోలికే, మీరు అక్కాచెల్లెళ్లేమో అనుకున్నాను. నీల వయస్సులో మీరుకూడా అచ్చు అలాగే ఉండేవారు.'

'మీ కెలా తెలుసు ?'

"మీ పెళ్ళిలో చూచాను."

"నా పెళ్ళి...."

"అవును. కృష్ణ నా ఫ్రెండే"

"ఊ" అంటూ మూల్గింది రాధ.

'వాడిని చూస్తే గుర్తుపట్టగలరా ఇప్పుడు'

"ఉహు ! ఎలా గుర్తు పట్టగలనండి. పెళ్ళిలో చూడటమే గదా మరల కనిపించనే లేదు. మా పెండ్లిఫొటో కూడ వాళ్ల దగ్గరే చిక్కుకుపోయింది. మీరు వచ్చినప్పట్నుంచి ఎక్కడో చూచాననుకుంటున్నా, బహుశా మా పెళ్ళిలో చూచి ఉండొచ్చు,"

"అవును, అంతే అనుకుంటా"అంటూ నవ్వాడతను.

రాధ ఏం మాట్లాడాలో తెలియక గోడల వైపు చూస్తూ కూర్చుంది.

"మీరు చాల బాగా పాడతారటగా ?" అన్నాడు.

"ఎవరన్నారు ?"

"ఇంకెవరు, కృష్ణే అన్నాడు"

"ఊ" అంటూ ముఖం చిట్లించింది.

"వాడంటే మీకు సదభిప్రాయం లేనట్లుందే"

"ఆ ప్రశ్నలన్నీ నన్నెందు కడుగుతున్నారో నాకర్థం కాలా"

"కృష్ణకు మీరంటే ఎంతో ఇష్టం"

"ఆ తెలుస్తూనే ఉందిగా" అంది హేళనగా

"మీ పెళ్ళి ఫొటో ఎప్పుడూ చూచుకుంటూంటాడు."

'ఇంకా నయం, పూజిస్తారన్నారుకాదు'

"మీరు చెప్పేది నిజమండి; ఒకవేళ పూజించవచ్చు కూడ."

రాధకు ఏమి సమాధాన మివ్వాలో తెలియక పేజీలు తిప్పటం మొదలెట్టింది. ఇంతలో నీల ఏదో హిందీ ట్యూన్ పాడుకుంటూ వచ్చి వీళ్లను చూచి ఆగిపోయింది. ఆ ముఖంలో ఆశ్చర్యం, కోపం, మిళితమైన భావమేదో కన్పించుతుంది. 'నమస్తే' మాష్టారూ ! ఏం పనిమీద వచ్చారు ? ఊరకరారు మహాను భావులంటారు."

"పనిమీదే వచ్చాననుకో. పనిమాత్రం నీతో కాదులే మీ అత్తతో"

"నీతో ఏం పని అత్తా ?" అంది విచిత్రంగా

"నాతోనా" అంటూ ఆశ్చర్యంగా చూచింది. రాధ ముఖంలో ఎఱ్ఱనిఛాయలు అలుముకున్నాయి. పెదవులు చిన్నగా అదుర్తూ ఏదో మాట్లాడబోయి ఆగిపోయినట్లు సూచిస్తున్నాయి.

"అవును మీతోనే" అన్నాడు అతను.

'ఏం ,చెప్పరేం ? ఏమిటలా చూస్తారు ?'

"కోపంలో మీరు బలే అందంగా ఉన్నారు,"అంటూరాధ వైపలాగే చూస్తూండిపోయాడు.

''ఏమిటి మీరు మాట్లాడేది" అంది కోపంగా,

సౌందర్యారాధన" వెక్కిరింపుగా జవాబిచ్చింది నీల.

(తరువాయి 23 వ పేజీలో)

## తొలగిన మబ్బులు

( 6 వ పేజీ తరువాయి)

"కరెక్ట్ నీలా కరెక్ట్, నా శిష్యురాలి వనిపించావు."

"ఇంతకీ మీరు వచ్చిన పనేమిటో చెప్పారు కాదు." అంది నీల. రావుగారు కూరల సంచీ ఊపుకుంటూ ఇంట్లో అడుగు పెటారు. చెల్లెలూ, కూతురితోపాటు మరో యువకుడు ఎవరు ? ఎవరు ?

"నమస్కారమండి"

"నమస్తే మీరు....

"మీరు కూడా మరచిపోయారా ? మీ బావమరది కృష్ణమోహన్నండి."

"నీవే అనుకున్నాను నాయనా. కాని సుదీర్ఘమైన ఏడు సంవత్సరాల తరువాత మళ్ళీ నాయింటికి ఎందుకొస్తారని...."

"పడిపోయిన బంధుత్వం కలుపుదామని వచ్చానండీ"

"మీ వాళ్ళు ఒప్పుకోవద్దా నాయనా ?"

అప్పట్లో వాళ్ళనెదిరించేందుకు అస్వతంత్రుణ్ణి, తొందరపడినా ఫలితం శూన్యమని తెలిసి ఈ క్షణాలకోసం ఎదురు చూచాను. నాకు ఉద్యోగం వచ్చాక మీరెక్కడుంది తెలియలేదు. నీల కాలేజీలో జాయినయిన కొత్తలో రాధ పోలికలు చూచి రాధకు ఏమైనా 'బంధువు కాకూడదా ? ఏ బంధుత్వం లేకపోతే అంత పోలిక లెలా వస్తాయని అనుమానించాను. మీరెవరైనా కనుపించుతారేమో అని రెండుమార్లు మీ ఇంటివైపొచ్చాను. అందుకే మీ అమ్మాయి నన్నో బడుద్ధాయి కింద కట్టింది" అంటూ నీలవైపు నవ్వుతూ చూచాడు.

ఆనందముతో నిండిన సిగ్గుతో నీల తలదించుకుంది.

"తల్లిదండ్రుల ఇష్టప్రకారం ఏపని చేసినా బావుంటుంది నాయనా. వాళ్ళకి ఇష్టంలేకుండా...."

''మీరాభయం వదిలేయండి. ముందు వాళ్ళు వద్దన్నా, పేచీపెట్టినా, దగ్గరకు రావటం మానినా తరువాత వాళ్ళే రాజీకి వస్తారు. ఇప్పటికే చాల ఆలస్యమై పోయిందని విచారిస్తున్నాను." అంటూ కృష్ణ నుదిటిపై ముంగురులు పైకి తీసుకున్నాడు.

నాయనా కృష్ణా! మేమెంత అదృష్టవంతులం, నాచెల్లెల్ని చూస్తే కడుపు తరుక్కుపోతుంది. దాన్ని గురించే నాబాధంతాను. దాని వయసు పిల్లలంతా సంసారంతో, పిల్లలతో నిండుగా కాపరాలు చేస్తుంటే అది యంత్రంలా ఆఫీసు, ఇల్లు అంటూ ఏ సుఖమూ లేకుండా గడపడం చూస్తే హృదయం నీరైపోయేది. నీలాటి భర్త దొరకడం దాని అదృష్టం. నీవు వచ్చావని మీఅక్కయ్యతో చెబుతానుండు." అంటూ కూరలసంచీ అక్కడేపారేసి లోపలికి పరుగెత్తారు రావుగారు. అన్నయ్యవెనక రాధ కూడా వెళ్ళబోయింది, ఆమెముఖం వికసించిన పద్మంలాఉంది. పద్మపత్రాల్లాంటి ఆమెనేత్రాలు ఆనందంతో మిలమిలలాడుతున్నాయి. సిగ్గుతో ఎఱ్ఱబడిన ఆమె ముఖంపై స్వేదబిందువులు ముత్యాల్లా మెరుస్తున్నాయ్. సిగ్గుతో ఆమెఅందం ద్విగుణీకృతమైనది.

''అత్తాయ్! మామయ్య ఒక్కరే ఉంటారు. ఆయినకు నీవుతోడుండు నే పోతున్నా" అంటూ చేయిపుచ్చుకుంది నీల.

"ఉండుపాపాయ్!" అంటూ వెళ్ళబోయింది రాధ.

"ఓహో! పాపాయివా" అంటూ నక్కుమన్నాడు కృష్ణ

భలే! పేరుపెట్టిపిలవండి దేవానంద్ మామయ్యగారూ! ఇదే మొదటి మారు కాబట్టి క్షమించి మాఅత్తయ్య నిచ్చేస్తున్నా" అంటూ రాధ పాణిని కృష్ణకందించి తుఱ్ఱుమంది లోపలికి నీల.

పండువెన్నెల పిండార బోసినట్లుంది. ఆకాశముపై ఏకాదశి చంద్రుడు వెలి మబ్బులతో దోబూచులాడు కొంటున్నాడు. డాబాపైకి పాకిన జాజి తీగపై జాజిపువ్వులు విచ్చుకొని సువాసనలు వెదజల్లుతున్నాయి. తెల్లని పడకపై మేనువాల్చిన కృష్ణ ఆకాశములోకి చూస్తూ అడుగుల సవ్వడికి తల తిప్పాడు, పాలమీగడలా ఉన్న తెల్లని చీరతో, తడబడుతున్న అడుగులతో కృష్ణను సమీపించింది రాధ, ఇరువురి మధ్య నిశబ్దం తాండవించింది. కృష్ణ తన బలమైన చేతో రాధని చుట్టేసి మరో చేత్తో చుబుకాన్ని పైకెత్తుతూ "రాధా!" నా వీనులలో ''రాపోయి రాపోయి ఓ మాధవా" అనే నీ తీయని పిలుపు అనుక్షణం వినిపించేది. నిన్ను ఎంత తొందరగా చేరాలనుకున్నానో అంత ఆలస్యమైనది. నా ఆలస్యానికి క్షమించవూ!" అన్నాడు.

"రాధ తన మునివేళ్ళతో అతని పెదవుల నద్దుపెట్టి "మీ లాంటివారికి భార్యనవటం ఎంత అదృష్టం! ఈ సుదినం కొఱకే ఇన్ని సంవత్సరాల నుంచీ వేచియున్నాను. ఇది నా జీవితంలో మరపురాని రోజు "అంటూ రాధ కృష్ణ ఎదపై వ్రాలిపోయింది, రాధ వదనములోని మబ్బులుతొలగి వెన్నెలలు వెలసినవి. ఆ నూతన ప్రేమైక దంపతులపై చంద్రుడు వెన్నెలలు కురిపించాడు. మలయ పవనాలు వారి చెక్కిలికి తాకి గిలిగింతలు పెట్టాయి. రాధాకృష్ణుల హృదయాలలో ఆనందం నిండిపోయింది,

———o———


మరపు రాకాసి నొకచేత నరకివైచి

మంచి జ్ఞాపకశకి పుట్టించు నట్టి

మా సుధీప్రకాశ్"కు సాటిమందులేదు

సేవన మొనర్చ మీరలే చెప్పగలరు.

సుధీప్రకాశ్ బుద్ధిబలమును వృద్ధిచేసి దేహబలము నొసగును.

6 ఔన్సుల సీసా రు. 2-0-0

శ్రీ లక్ష్మీనృసింహ ఆయుర్వేద వైద్యశాల

మచిలీపట్నం